క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ



రాగి వైరును చోరీ చేశారని చూపుతున్న రైతు శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం రూరల్: దేవుల పల్లిలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో రైతుల పొలాల్లో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ముళ్లపూడి శ్రీనివాస్, పారేపల్లి చంటాబ్బాయి ఉదయం వారి పొలాలకు వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి వైరును చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని రైతులు విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కాలంలో మండలంలో పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ చేస్తున్న ఘటనలు ఎక్కువ అవుతున్నాయని, ఈ చోరీలు జరగకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో జాగరణ రాత్రులు ప్రారంభం



కొయ్యలగూడెం జామియా మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రంజాన్ నెల పురస్కరించుకొని పవిత్ర జాగరణ రాత్రులు (లైలాతులు ఖదర్) ఆదివారం నుంచి ప్రారంభం అయ్యాయి. రంజాన్ నెల ప్రారంభమైన తరువాత 21, 23, 25, 27, 29 వరకు ఐదురోజులు బేసి దినాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించే జాగరణ రాత్రులుగా ఖురాన్‌లో పేర్కొన్నట్లు ఇమామ్ తెలిపారు. ఈ రోజుల్లోనే అల్లా ఖురాన్‌ను లిఖించినట్లు తెలిపారు. రంజాన్ నెల రోజులు ఉపవాస దినాలు చేయలేని ముస్లింలు కనీసం ఈ ఐదు రోజులు ప్రార్థనలు, జాగరణ ఉపవాసం నిర్వహిస్తే వెయ్యి నెలల ఉపవాస పుణ్యం లభిస్తుందని ఖురాన్‌లో పొందుపరిచి ఉందన్నారు. ఈ సందర్భంగా కన్నాపురం, వేదాంతపురం, బయ్యన్నగూడెం, యర్రంపేట, రాజవరంలలోని మసీదులలో జాగరణ రాత్రుల ప్రార్థనలు నిర్వహించారు.

లింగపాలెం మండల సచివాలయ కోకన్వీనర్‌గా రెడ్డి ప్రవీణ్



ఎంపీ శ్రీధర్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న రెడ్డి ప్రవీణ్

లింగపాలెం: లింగపాలెం మండల సచివాలయ కోకన్వీనర్‌గా రెడ్డి ప్రవీణ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం ప్రవీణ్ ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజులను కలసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ పార్టీ విజయానికి కష్టపడి పనిచేస్తానని చెప్పారు.

క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలి



ధర్మాజీగూడెం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న నేతలు

లింగపాలెం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన, సత్‌ప్రవర్తన, సేవాభావం కలిగి ఉండాలని ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు ఆకాంక్షించారు. ఆదివారం ఈస్టర్ పండుగ సందర్భంగా మండలంలోని భోగోలు, ధర్మాజీగూడెం తదితర గ్రామాలలోని చర్చిలలో వారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం విశ్వాసులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ నూతలపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఆర్‌సీ లీగల్ అడ్వైజర్‌గా గన్నాబత్తుల విజయ

నిడమర్రు: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా న్యాయ సలహాదారుడిగా భీమవరానికి చెందిన లాయర్ గన్నాబత్తుల విజయ సత్యవతిని నియమించినట్లు కమిషన్ చైర్మన్ లింగపల్లి ఎన్‌ఎస్‌వీఎస్ మణికంఠ తెలిపారు. ఆదివారం బువ్వనపల్లిలో ఈస్ట్ జోన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లాయర్ విజయకు నియామక పత్రాన్ని వైస్ చైర్మన్లు నోచర్ల శ్రీనివాసరావు, సంకు నాగశేషు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ జిల్లాలోని వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం తనవంతుగా ఫిర్యాదుదారుల తరఫున ఉచిత న్యాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంకు తాతాజీ, లక్ష్మీగణేశ్వరరావు ఉన్నారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర భవిష్యత్

- ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు
- చింతలపూడి మండలం కనిపెడ, లింగపాలెం మండలం భోగోలులో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం



చింతలపూడి మండలం కనిపెడలో మాట్లాడుతున్న ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, వైఎస్సార్ సీపీ శ్రేణులు



లింగపాలెం మండలం భోగోలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, చిత్రంలో ఎంపీ కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎంపీ అభ్యర్థి కె సునీల్ కుమార్ యాదవ్

చింతలపూడి: రాష్ట్ర భవిష్యత్తు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ముడిపడి ఉందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని ఉర్లగూడెం పంచాయతీ కనిపెడ గ్రామంలో ఆదివారం మండల సచివాలయాల కన్వీనర్ మామిళ్ళపల్లి రాంబాబు గృహం వద్ద చింతలపూడి మండల కార్యకర్తల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, ఎంపీ అభ్యర్థి కె సునీల్ కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి మరోసారి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. విభేదాలు విడనాడి పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. చింతలపూడి నియోజకవర్గంలో 50 వేల ఓట్ల మెజార్టీ అందించాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి బలమని ఏలూరు ఎంపీ అభ్యర్థి కె.సునీల్‌కుమార్ అన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని అన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కె విజయరాజు మాట్లాడుతూ ఈ 40 రోజులు కష్టపడి పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకువద్దామని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని, పార్లమెంట్ సభ్యుల సహకారంతో పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా నూతనంగా నియమించబడ్డ మండల సచివాలయాల కన్వీనర్ ఎం రాంబాబు, పట్టణ సచివాలయాల కన్వీనర్ బి చెంచమరాజులను సత్కరించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణ, ఎంపీపీ డా బి రాంబాబునాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీ కోటగిరి శ్రీధర్ సోదరి పొన్నాల అనిత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి కె దినేష్‌రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్ భరత్ రెడ్డి, పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జి జి.రాజేష్‌నాయుడు, పట్టణ బూత్ కన్వీనర్ వెంపా కృష్ణ, సర్పంచ్‌లు తాండ్ర రామకృష్ణారావు, ఆర్‌వీ రామారావు, సొసైటీ అధ్యక్షుడు గిరి భోగారావు, అలవాల బాబు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలబడదాం

లింగపాలెం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి జగనన్నకు అండగా నిలవాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఆదివారం లింగపాలెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం భోగోలులో పార్టీ నేత ఇనుగంటి సతీష్ ఇంటి ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ ఏలూరు ఎంపీగా కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యేగా కంభం విజయరాజులను అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి కె సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కె విజయరాజు మాట్లాడుతూ సమష్టిగా పనిచేసి మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, నియోజకవర్గ పరిశీలకులు సూర్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ధర్మాజీగూడెం.రంగాపురం సొసైటీల చైర్మన్లు ఉప్పలపాటి వరప్రసాద్, రెడ్డిన శ్రీను, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, మండల బూత్ కమిటీ కన్వీనర్ ఉప్పలపాటి గోపి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్లంటే చంద్రబాబుకు అంత చులకనా..?



ఎం.సూర్యనారాయణ, నియోజకవర్గ పరిశీలకులు

చింతలపూడి: టిప్పర్ డ్రైవర్ల పట్ల చిన్న చూపుతో మాట్లాడి అవమానపరిచిన చంద్రబాబుకు రాష్ట్రంలోని డ్రైవర్లందరూ వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని నియోజకవర్గ పరిశీలకులు ఎం సూర్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన చింతలపూడిలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలకు అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు ఇచ్చి గౌరవిస్తుంటే చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. నాయకులు ఎక్కడినుంచో పుట్టుకురారని ప్రజల నుంచే పుడతారని అన్నారు. ఈ విషయం గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి టిప్పర్ డ్రైవర్‌లోని నాయకత్వ లక్షణాలను పరిశీలించి అసెంబ్లీ సీటిచ్చి నిలబెట్టారని అన్నారు. లారీ వ్యవస్థ అంటే చంద్రబాబుకు అంత చులకనా అంటూ ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ పేదల పార్టీ అని రేపు జరగబోయే ఎన్నికలు పేదలకు పెత్తందారులకు మధ్య జరిగే ఎన్నికలు అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో సగం సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని చెప్పారు. ప్రజలు ఆలోచించి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని, పేదల పెన్నిధి సంక్షేమ సారథి జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల కమిషన్ పునరాలోచించాలి



మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: వలంటీర్ల విధుల విషయంలో ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గత ఐదు సంవత్సరాలుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి నెలా 1వ తేదీన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు వలంటీర్లు పింఛన్ అందిస్తున్నారన్నారు. అయితే ఎన్నికల రీత్యా పింఛన్ వలంటీర్లు ఇవ్వకూడదని నిర్ణయించందని, దీంతో లబ్ధిదారులు ఇబ్బంది పడే అవకాశముందని, కావున ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయంపై పునఃపరిశీలించాలని కోరారు.

నేడు పోలవరంలో ప్రచారం

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారాన్ని సోమవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కడెమ్మ అమ్మవారి ఆలయం వద్ద పూజలు నిర్వహించి ఇంటింటికి ప్రచారం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

పోలవరం ఎమ్మెల్యే బాలరాజు , వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి



నాగన్నగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి



ఎన్నికలకు సిద్ధం అంటూ ప్రచారం చేస్తున్న రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు తదితరులు

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్ష అని ఆ పార్టీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రాజానగరం, ముద్దప్పగూడెం, లక్ష్మీపురం, నాగన్నగూడెం, పండుగూడెం, కామయ్యకుంట, కోర్సకన్నప్పగూడెం, తదితర గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులకు ప్రజలు హారతులు ఇచ్చి వీరతిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. లక్ష్మీపురం గ్రామంలో మహిళలు రూ.100 నోట్లతో తయారు చేసిన దండలను మెడలో వేసి వారి అభిమానాన్ని చాటుకున్నారు. మే 13న జరిగే ఎన్నికలకు మేమంతా సిద్ధం.. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తామంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికలు సమీపించడంతో ఓటమి పేరుతో దొంగల ముఠా వస్తుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. 14 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నేటికీ సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన కూటమి అధికార దాహం తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేదన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి జగనన్నకు మద్దతు ఇవ్వాలని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు.

మండుటెండలో ప్రచారం.. చెట్ల కింద భోజనం

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాజ్యలక్ష్మి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే బాలరాజుతో కలిసి ఇంటింటికీ తిరగడమే కాకుండా ప్రచార రథంపై ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరుతున్నారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు, చెట్ల కింద కూర్చుని కార్యకర్తలతో పాటు భోజనం చేస్తున్నారు. కార్యకర్తలు, నాయకులే తమ బలమని వారితోపాటే ఉంటూ ప్రచారం చేస్తామని వారు చెప్తున్నారు. కాగా ఈ ప్రచార కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్‌లు కుంజా దుర్గమ్మ, పెడకం విజయలక్ష్మి, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ బాజీ, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, ఎంపీటీసీలు మొడియం వెంకమ్మ, గాలి దుర్గారావు, కొవ్వాసి వరలక్ష్మి, నాయకుడు కుంజా ప్రసాద్, తాళ్ళూరి ప్రసాద్, మునగాల నాగేశ్వరరావు, బానోతు కృష్ణ, యోహాన్ నాయక్, ముత్తు, కొయ్యలగూడెం మండల నాయకులు గొడ్డాడి నాగేశ్వరరావు, కపిలవాయి హరిసూర్యనారాయణ, చిక్కాల దుర్గాప్రసాద్, తమ్మా రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాపు కులస్తులకు పెద్ద పీట వేసింది జగనే



శింగగూడెం కాపునాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కంభం విజయరాజు

లింగపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపులకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. ఆదివారం లింగపాలెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు ముఖ్యనాయకుల సమావేశం శింగగూడెంలో కాపునేత పసుపులేటి శివ ఇంటి ఆవరణలో జరిగింది. విజయరాజు మాట్లాడుతూ సీఎం వైస్ జగన్‌మోహనరెడ్డి కాపులకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. పార్టీ విజయానికి కృషి చేసిన కాపు నాయకులకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రీజనల్ కోఆర్డీనేటర్, జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చిన్నమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ కాపుల పలు సమస్యలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించినట్లు తెలిపారు. ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కువగా కాపు కులస్తులకు ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కాపులందరు కలసికట్టుగా పనిచేసి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని మరలా సీఎం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, కాపు నాయకులు గంధం చంటి, పసుపులేటి శివ, చీదరాల ప్రసాద్, మల్నేడి బాబి, చల్లా రెడ్డియ్య, నందేటి పుల్లారావు, చల్లా గంగాధరావు, పసుపులేటి వెంకటేశ్వరరావు, రెడ్డి బాబ్జి, రెడ్డి ప్రవీణ్, నాగరాజు, నారిశెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



చింతలపూడి: భట్టువారిగూడెం పరిశుద్ధ బైబిల్ మిషన్ చర్చిలో క్రైస్తవ భక్తులతో పొన్నాల అనిత

చింతలపూడి: ఈస్టర్ పండుగను క్రైస్తవులు మండలంలో ఆదివారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని క్రైస్తవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక బోయగూడెం ఆర్‌సీఎం చర్చి, భట్టువారిగూడెం పరిశుద్ధ బైబిల్ మిషన్ చర్చిలో క్రైస్తవులు వేకువజామునే యేసు పునరుత్థాన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాపుల రక్షణకోసం శిలువ వేయబడి తిరిగి లేచిన క్రీస్తు ఔన్నత్యాన్ని పలువురు బోధించారు. ఏలూరు ఎంపీ శ్రీధర్ బాబు సోదరి పొన్నాల అనిత ఈస్టర్ వేడుకల్లో పాల్గొని క్రైస్తవ భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపదేశికులు, వివిధ గ్రామాల నుంచి విశ్వాసులు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: అంకాలగూడెం మిషనరీ హాస్పిటల్ వద్ద ఉన్న బరియల్ గ్రౌండ్‌లో అధిక సంఖ్యలో విశ్వాసులు కొవ్వొత్తులు వెలిగించి ఈస్టర్‌ను జరుపుకున్నారు. సమాధుల వద్ద పూలమాలలతో అలంకరించి, పెద్దల ఆత్మశాంతికై ప్రార్థనలు పాటించారు. పొంగుటూరు, ఆరిపాటి గవరవరం, కన్నాపురం. కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం, వేదాంతపురం, రాజవరం, యర్రంపేట చర్చిల వద్ద సామూహిక ప్రార్థనలు, క్రీస్తు బోధనల కార్యక్రమాలు నిర్వహించారు.

కామవరపుకోట: ఈస్టర్ సందర్భంగా స్థానిక రోమన్ క్యాథలిక్ మిషన్ విచారణ గురువులు ఫాదర్ పీటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ పీటర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి పాప పరిహారార్థం ఏసు క్రీస్తు సిలువలో మరణించి పునరుత్థానుడై మూడవరోజు మరలా జీవముతో లేచారని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఏసుక్రీస్తు మార్గమును అనుసరించాలని కోరారు. అనంతరం చర్చి ఆవరణలో ఈస్టర్ విందును అందించారు. సంఘ విశ్వాసులు, సిస్టర్స్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



కామవరపుకోట: కొత్తూరు ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తున్న చర్చి ఫాదర్లు



పోలవరం: ఈస్టర్ సందర్భంగా చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: మండలంలోని పలు క్రైస్తవ దేవాలయాల్లో ఆదివారం ఈస్టర్ పండుగ ప్రార్థనలు నిర్వహించారు. పోలవరంలోని బైబిలు మిషన్ సింధూర మందిరంలో దైవ సేవకురాలు ఎలిపే పరంజ్యోతి మాట్లాడుతూ మరణాన్ని జయించి తిరిగి లేచిన ఏసుక్రీస్తుని కొనియాడుతూ స్తుతులు, స్తోత్రములు తెలిపారు. యెదుషలేములో ఖాళీ సమాధి క్రీస్తు పునరుత్థానికి నిదర్శనముగా ఉందన్నారు. పాస్టర్ ఎలిపే గమానియేలు, షైనీ ఆరోన్, పిల్లి అనూష, ఎస్తేరమ్మ, అనురాధ, రాజు, సుందరి, సుజీవరాజు, జస్విన్ దేవ్, జస్సికా పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేటలోని నూకాలమ్మవారి ఆలయంలో 44వ వార్షిక జాతర మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఆదివారం ఉదయం కొత్తపేటకు చెందిన 108 మంది సువాసినీలు, మరో 150 మంది మహిళలతో కలశయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారు, పోతురాజు బాబుల ఘటాలతో నగర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పేటలోని ప్రతి కుటుంబ సభ్యులు అమ్మవారికి, పోతురాజు బాబుకు మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి, చద్ది నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ కనకశ్రీ రాజేశ్వరి కృష్ణ, 42వ డివిజన్ కార్పొరేటర్ అర్జి సత్యవతి నాగేశ్వరరావు దంపతులు, 44వ డివిజన్ కార్పొరేటర్ పాలిమేర దాసు, వెల్లంకి రాజు, కోలా భాస్కరరావు, సన్నీ రాయుడు, వలపుల బుజ్జి, బావిశెట్టి కేశవ, పల్లెల సత్యనారాయణ, సంబంగి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నక్క నాగేశ్వరరావు మాట్లాడుతూ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 8వ తేదీ వరకూ కొనసాగుతాయని, ప్రతి రోజు కొత్తపేటలోని వీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

దెందులూరు: ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు, గతంలో పలు కేసుల్లో అరెస్టు అయిన వారి నడవడికపై పోలీస్ నిఘా ఉందని దెందులూరు ఎస్సై కే.స్వామి తెలిపారు. ఆదివారం దెందులూరు మండలం పరిధిలోని రౌడీషీటర్లకు దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రజలు ప్రశాంతంగా ఓటు వినియోగించుకుని ఇళ్లకే పరిమితమవ్వాలన్నారు. శాంతిభద్రతలకు, ఎన్నికల విధులకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని సూచించారు. పోలీస్ శాఖ, ఎన్నికల కమిషన్ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తే చర్యలు తప్పవన్నారు.

పక్కా భవనం నిర్మించాలి

భీమడోలు: ఏలూరులో ఆదివారం జరిగిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి, భీమడోలు కమిటీ అధ్యక్షుడు పి.రాజారావు భీమడోలు సివిల్ కోర్టుకు పక్కా భవనం నిర్మించాలని, అద్దె భవనంలో పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. ఏలూరులో నిర్వహించిన సమావేశంలో కోర్టుల్లో మౌలిక వసతుల కల్పన, న్యాయవాదుల సమస్యలు, కొత్త చట్టాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి భీమడోలు కమిటి అధ్యక్షుడు పి.రాజారావుతో పాటు ప్రధాన కార్యదర్శి ప్రత్తిపాటి బాలాజీ, సంయుక్త కార్యదర్శి గొటికల సంజయ్‌బాబు, కోశాధికారి పంట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

5వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు పొడిగింపు

టి.నరసాపురం: ఏపీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆ పాఠశాలల ఏలూరు జిల్లా కన్వీనర్, అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డీఎస్‌బీ శంకర్రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల విద్యార్థులకు ఏప్రిల్ 25వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కేంద్రంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు ఈ నెల 5వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ://ఏపీఆర్‌ఎస్ డాట్ ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్ డాట్ ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత వరప్రసాద్ దంపతులకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన వంగల శివరామకృష్ణ వరప్రసాద్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.